ఆంధ్రజ్యోతి


గరిష్ఠం 28.5
కనిష్ఠం 22.0

ANDHRAJYOTHY

నల్లగొండ

5

మంగళవారం 10 సెప్టెంబరు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.30 (306.9898)	2,04,915	1,37,110
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.15 (3.73)	3,254	1,240
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.24 (41.59)	1,10,854	1,10,854

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.230



గణేశ్ @ రూ. 300 కోట్లు

గణేశ్ నవరాత్రి ఉత్సవాలంటే భక్తి శ్రద్ధలతో తొమ్మిదిరోజుల పాటు వినాయకుడిని పూజించడమే కాదు, తమ కమిటీ గొప్పతనాన్ని, సత్తాను చాటే ప్రదర్శనగా మారింది. ఐక్యత కోసం, భక్తిప్రపత్తులు పెరగడం కోసం నిర్వహించే ఈ ఉత్సవాలు ప్రస్తుతం ఆర్భాటాన్ని, హంగామాను చాటుకునే వేదికగా మారుతున్నాయి. గణేశ్ విగ్రహాలు మొదలు మండపాల అలంకరణ, డీజేలు, బ్యాండ్ మేళాలు, అన్నదానాలు, ప్రత్యేక వస్త్రాలంకరణ, శోభాయాత్రలో ప్రత్యేకత చాటేందుకు పోటీ పెరగడంతో ఉత్సమ కమిటీల ఖర్చు అదే స్థాయిలో భారీగా పెరిగింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- నవరాత్రుల నిర్వహణకు భారీ ఖర్చుకు వెరవని ఉత్సవ కమిటీలు
- మారుమూల తండా మొదలు అంతటా మండపాలు
- విగ్రహ ప్రతిష్ఠ, శోభాయాత్ర వరకు దండిగా ఖర్చు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10వేల మండపాలు

ఉమ్మడి జిల్లా అంతటా పట్టణాల్లో ప్రతీ గల్లీలో, గ్రామాల్లో వాడవాడలా గణేశ్ ప్రతిమలను ప్రతిష్ఠించి నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. మారుమూల గిరిజనతండాల్లో పది ఇళ్లు ఉన్నచోట కూడా గణేశ్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదివేల పైచిలుకు విగ్రహాలు ప్రతిష్ఠించినట్టు అధికారులు చెబుతున్నారు. నవరాత్రుల సందర్భంగా ఉత్సవ కమిటీలు రూ.300 కోట్ల పైచిలుకు వ్యయం చేస్తున్నట్టు అంచనా. విగ్రహాలు మొదలు మండపాల అలంకరణ, నిత్యపూజలు, నిత్య అన్నదానాలు, టెంట్లు, కుర్చీలు, బ్యాండ్‌మేళాలు, శోభాయాత్రరోజున ప్రత్యేక అలంకరణలు ఇలా అడుగడుగునా భారీగా ఖర్చు చేస్తుండడంతో ఒక్కో మండపం వద్ద కనీసం రూ.50వేల నుంచి గరిష్ఠంగా రూ.5లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. భక్తులే చందా ల రూపంలో వీటిని సమకూర్చుకుంటుంటే, కొన్ని చోట్ల వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, రాజకీయనాయకులు విగ్రహాలను అందజేయడం, అన్నదానాలు చేయించడం వంటి కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. మొత్తంగా ప్రతీ భక్తుడు గణేశ్ ఉత్సవాల్లో ఏదో రకంగా ఎంతో కొంత భాగస్వామ్యం కలిగి ఉండడం ఈ ఉత్సవాల ప్రత్యేకత.

ఉమ్మడి జిల్లాలో 10వేల పైచిలుకు మండపాలు

నల్లగొండ జిల్లాలో 4,302 వరకు గణేశ్ ప్రతిమలను ప్రతిష్ఠించగా, నల్లగొండ పట్టణంలో పెద్ద, చిన్న కలిపి సుమారు 800వరకు ఏర్పాటుచేశారు.మిర్యాలగూడ పట్టణంలో 300 వరకు, దేవరకొండలో 76, సూర్యాపేటలో 450, భువనగిరిలో 500 పైచిలుకు విగ్రహాలు ప్రతిష్ఠించారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం 2,650 మండపాల్లో లంబోదరుడు పూజలందుకుంటుంటే, యాదాద్రి జిల్లాలో 3,067 మండపాల్లో గణేశ్ నవరాత్రోత్సవాలు జరుగుతున్నాయి.మొత్తంగా ఉమ్మడిజిల్లాలో వాడవాడలా గణేశ్ మండపాలు ఏర్పాటయ్యాయి.


సర్వాంగ సుందరంగా మండపాల అలంకరణ

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో మండపాల అలంకరణే ప్రత్యేకంగా నిలుస్తోంది. ఎక్కువ కాంతినిచ్చే మెర్క్యురీ లైట్లు, రంగురంగుల సీరియల్ బల్బులు, డెకరేషన్ ఫ్లవర్స్‌తో మండపాలను అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. టెంట్లు మొదలు అలంకరణలో వాడే ప్రతి వస్తువూ అందంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. మైక్‌లు, సౌండ్ సిస్టమ్స్ కూడా ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా ఏర్పాటు చేయడంతో ఖర్చు భారీగా పెరుగుతోంది. మండపాల అలంకరణకు కనీసం రూ.10వేలనుంచి రూ.లక్ష వరకు వెచ్చిస్తున్న పరిస్థితి ఉంది.

అందరికీ అందుబాటులో ప్రతిమలు

గణేశ్ ఉత్సవాల్లో ప్రతిష్ఠించే వినాయకవిగ్రహాలు ఉత్సవ సమితి గొప్పదనాన్ని చాటేలా ఘనంగా ఏర్పాటు చేసేందుకు డబ్బుకు వెరవకుండా ఖర్చుపెడుతున్నారు. విభిన్న రూపాల్లో, భిన్నమైన రీతిలో ఆకర్షణీయంగా ఉండే గణేశ్ ప్రతిమలను కమిటీ ప్రతిష్ఠకు వినియోగిస్తున్నారు. పీవోపీ, రంగులతో తయారయ్యే ఈ విగ్రహాలను తక్కువలో తక్కువగా రూ.5వేల నుంచి గరిష్ఠంగా రూ.1లక్ష వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.అత్యధికంగా రూ.20వేల నుంచి రూ.35వేల నడుమ ధర ఉన్న విగ్రహాలే ఎక్కువగా ప్రతిష్ఠించారు.

ప్రతిష్ఠాపన, నిమజ్జన పూజలు



విగ్రహ ప్రతిష్ఠాపన, నిమజ్జనం రోజున ప్రత్యేక పూజలతో పాటు, సేవలు చేస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలతో పాటు అతిథులను, ఉత్సవకమిటీ సభ్యులను ప్రత్యేకవస్త్రాలతో సత్కారాలు, సన్మానాలు చేస్తుండడంతో ఈ రెండు రోజుల్లో ఒక్కో మండపం వద్ద కనీసం రూ.5వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చు వస్తోంది.

టెంట్లు, కుర్చీలకు డిమాండ్

గణేశ్ నవరాత్రోత్సవాల సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే స్టేజీతో పాటు మండపాల వద్ద కుర్చీలు, టెంట్లు, వాటర్ డ్రమ్ములు, వాటర్‌క్యాన్లు ఏర్పాటు చేశారు. తొమ్మిదిరోజుల పాటు భక్తులకు సదుపాయాలు కల్పించే నిమిత్తం ఏర్పాటు చేసే వీటికి ఒక్కో మండపం వద్ద కనీసం రూ.15వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చవుతోంది.

డీజే మోగిందంటే కరెన్సీ రాలాల్సిందే

విగ్రహ ప్రతిష్ఠాపన రోజు, శోభాయాత్ర రోజు డీజేలతో అదరగొడితే, మిగిలిన రోజుల్లో లేటెస్ట్ మైక్ సెట్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం సౌండ్ సిస్టమ్‌కు ఒక్కో మండపం వద్ద కనీసం రూ.10వేల నుంచి రూ.30వేలవరకు ఖర్చు వస్తోంది. డీజేలు ఏర్పాటు చేసిన చోట్ల ఈ ఖర్చు రూ.50వేలు దాటుతోంది.

పూజారులకు సంతోషకరమైన సంభావనలే

ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠాపన మొదలు నిమజ్జనం వరకు పూజారులు రోజూ ఉదయం, సాయంత్రం మండపాల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వారికి ఉత్సవ సమితి స్థోమతను బట్టి రూ.2వేల నుంచి రూ.15వేల వరకు సంభావన చెల్లిస్తున్నారు. భక్తుల ఇష్టం మేరకు ఇతర సంభావనలు కూడా ఉంటాయి.

అన్నదానానికి వెరవని భక్తులు



గణేశ్ మండపాల వద్ద భక్తులు అన్నదానాలు చేస్తుంటారు. భక్తులు స్వచ్ఛందంగా ప్రతి రోజూ అన్నదానం చేసేందుకు ముందుకు వస్తుంటారు. చిన్న మండపాల వద్ద అన్నదానానికి రోజుకు రూ.10వేల వరకు ఖర్చయితే పెద్దమండపాల వద్ద స్థోమతను బట్టి రూ.20వేల నుంచి రూ.1లక్షవరకు కూడా భక్తులు వెచ్చిస్తున్న పరిస్థితి ఉంది.

శోభాయాత్రకు దండిగా ఖర్చు

గణేశ్ నవరాత్రోత్సవాల అనంతరం నిమజ్జనానికి తరలే రోజు ఆయా కాలనీలు, పట్టణాలు, గ్రామాల్లో ఉత్సవ సమితుల ఆధ్వర్యంలో గ్రాండ్‌గా శోభాయాత్రలు నిర్వహిస్తున్నారు. డీజేలతో పాటు, బ్యాండ్‌మేళాలు, ప్రత్యేక డ్రస్సులతో ఆట, పాటలతో కమిటీ సభ్యులు, కుటుంబాలతో సహా శోభాయాత్రలో పాల్గొని సందడి చేస్తున్నారు. లారీలు, మినీలారీలు, ట్రాక్టర్లు, ఆటోల్లో గణేశులను తీసుకెళ్తూ డ్యాన్సులు,బ్యాండ్ మేళాలతో పాటు, రంగులు చల్లుకుంటూ సందడి చేస్తారు. ఈ శోభాయాత్రలకు ఒక్కో కమిటీకి కనీసం రూ.10వేలనుంచి రూ.1లక్షవరకు ఖర్చవుతోంది.



మద్యం విక్రయాల్లోనూ దడదడే

నవరాత్రులలో ముఖ్యంగా శోభాయాత్ర రోజు మద్యం విక్రయాలకూ గిరాకీ ఎక్కువగానే ఉంటోంది. ఆ రోజున శోభాయాత్రలో పాల్గొనేందుకు భక్తులు సరదాగా మద్యం తీసుకొని స్నేహితులతో కలిసి ఉత్సాహంగా డ్యాన్సులు చేస్తూ గణేశ్ నిమజ్జనం చేస్తారు. వాస్తవానికి ఆ రోజున మద్యం విక్రయాలు ఉండకపోయినా, అంతకుముందే మద్యం కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు.

రోజువారీ అలంకరణలూ ప్రత్యేకమే

నవరాత్రోత్సవాల సందర్భంగా గణేశునికి పూజలు నిర్వహించే క్రమంలో రోజువారీ అలంకరణలకు భక్తులు వెరవకుండా ఖర్చు చేస్తున్నారు. పూలదండలు, స్వామివారికి వస్త్రాలంకరణ, ప్రసాదాలు, నైవేద్యాలకు ఆరోజు పూజలో పీటలమీద కూర్చునే దంపతులు వెచ్చిస్తున్నారు. ఉదయం, సాయంత్రం కూడా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. అందుకోసం ఒక్కో జంట కనీసం రూ.3వేల నుంచి రూ.15వేలవరకు ఖర్చు చేస్తున్నాయి.

హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



కాళోజీకి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

నల్లగొండ, సెప్టెంబరు 9: బీఆర్ఎస్ బీఫాంపై గెలిచి పార్టీ మారిన ద్రోహులకు చెంపపెట్టుగా హైకోర్టు తీర్పు వచ్చిందని, ఈ తీర్పును స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మహాకవి కాళోజీ నారాయణరావు జయంతిలో పాల్గొని, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంపై నమ్మకం పెరిగేలా తీర్పు ఉందని, ప్రజా కోర్టులో కూడా ద్రోహులకు, కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వారిపై అనర్హత వేటు పడటం ఖాయమని, ఉప ఎన్నికలు వస్తాయన్నారు. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామన్నారు. హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసున్నారని, హైదరాబాద్ అంటేనే భయపడేలా చేస్తున్నారన్నారు. రాజకీయ కక్ష సాధింపులు చేస్తూ హైడ్రామా చేస్తున్నారని, రేవంత్ చర్యలు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. బడాబాబుల విషయంలో ఒకలా, పేదల విషయంలో మరోలా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నాయకులు కటికం సత్తయ్యగౌడ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మాలే శరణ్యారెడ్డి, బోనగిరి దేవేందర్, కొండూరు సత్యనారాయణ, అభిమన్యు శ్రీనివాస్, కరీంపాషా, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 9: రానున్న రెండు నెలలు పారిశుధ్యంపై ప్రత్యేక అధికారులు దృష్టిసారించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చిన్న పనులకు కార్యదర్శులు ముందుగా అడ్వాన్స్ తీసుకునే సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ప్రతీ మంగళవారం ప్రత్యేక అధికారులు ఒక గ్రామాన్ని సందర్శించి, పారిశుధ్యం, తాగునీరు, సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీలకు గడ్డి కోసే యంత్రాన్ని కొనుగోలు చేయాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన అన్ని ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మునిసిపాలిటీల్లో పారిశుధ్యాన్ని తనిఖీ చేసేందుకు జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీ చేయాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్రను కోరారు. పాఠశాలలు, ఆస్పత్రుల అభివృద్ధికి నియమించిన ప్రత్యేక అధికారులు మరోసారి తనిఖీచేసి నివేదిక ఇవ్వాలన్నారు. మొదటి విడత పాఠశాలల్లో చేపట్టిన పనులను బుధవారం నాటికి పూర్తి చేయాలని, రెండో విడతలో భాగంగా కిచెన్ షెడ్లు కంప్యూటర్ ల్యాబ్‌లు, మరమ్మతులపై దృష్టి సారించాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో పురోగతి ఉండాలన్నారు. అనంతరం ఎల్ఆర్ఎస్‌ను సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, శ్రీనివాస్, డీఎఫ్‌వో రాజశేఖర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్వో రాజలక్ష్మి, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీవితాన్ని త్యాగం చేసిన ప్రజాకవి కాళోజీ : కలెక్టర్

నల్లగొండ కల్చరల్: జీవితాన్ని తెలంగాణకు త్యాగం చేసిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని కలెక్టర్ అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాళోజీ స్వాంతంత్ర్య ఉద్యమంలో కాకుండా తెలంగాణ ఉద్యమంలో కూడా పాల్గొని జైలు జీవితాన్ని గడిపారన్నారు. తన రచనల ద్వారా రాష్ట్ర ప్రజల్లో రాజకీయ, సాంఘిక చైతన్య స్ఫూర్తిని కలిగించారన్నారు.

హోంగార్డు కుటుంబాలకు ఆర్థిక భరోసా:ఎస్పీ

నల్లగొండ, సెప్టెంబరు 9: హోంగార్డు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో అర్జీలను తీసుకొని మాట్లాడారు. హోంగార్డుల సంక్షేమం కోసం పోలీస్‌శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 26మంది హోంగార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్ షిప్, ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. మొత్తం వివిధ ప్రాంతాల నుంచి 40మంది అర్జీదారులు రాగా, వారితో ఎస్పీ మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, హోంగార్డు ఆర్ఐ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టు క్షేత్రానికి పాలకమండలి ఉండేనా?

- స్థానికసంస్థల ఎన్నికల నేపథ్యంలో సాగుతున్న చర్చ
- ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్
- దరఖాస్తుకు రేపటితో ముగియనున్న గడువు
- చైర్మన్, ధర్మకర్త పదవుల కోసం ఆశావహుల యత్నాలు



నార్కట్‌పల్లి, సెప్టెంబరు 9: జిల్లాలో అతి పెద్ద పుణ్యక్షేత్రం, రెండో యాదగిరిగుట్టగా ప్రాచుర్యం పొందిన నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి ఈ సారైనా పాలక మండలి (ట్రస్టు బోర్డు) ఏర్పాటయ్యేనా, లేదా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు నిలిచేనా? ఎమ్మెల్యే వేముల వీరేశం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న చర్చ జోరుగా సాగుతోంది. ఆలయ నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ఆగస్టు 23న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ట్రస్టీగా నియామకమయ్యేందుకు నోటిఫికేషన్ జారీ తేదీ నుంచి ఇచ్చిన 20 రోజుల లోపు దరఖాస్తుకు విధించిన గడువు ఈనెల 11తో ముగియనుంది. దీంతో ధర్మకర్తలుగా పదవులను ఆశిస్తున్న ఆశావహులు ఇప్పటికే ఓ పర్యాయం ఎమ్మెల్యేను కలిసి ఆయన్ను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ధర్మకర్తలుగా నియామకమైన వారిలో నుంచే ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకునే విధానం ఉంది.

అందరిలోనూ సందేహాలు

ఎమ్మెల్యే సూచన మేరకే ట్రస్టీ సభ్యులుగా నియామకం చేపట్టే అవకాశం ఉండటంతో ఆశావహులు దరఖాస్తుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అసలు పాలక మండలిని ఏర్పాటుచేస్తారా? నిలిపివేస్తారా? అనే సందేహాలు అందరిలో వ్యక్తమవుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ట్రస్టుబోర్డు ఏర్పాటు, ఆ తర్వాత పరిణామాలు రాజకీయంగా ప్రభావం చూపించవచ్చనే అనుమానాలతో ధర్మకర్తల మండలి ఏర్పాటును వాయిదా వేసే అవకాశాలుంటాయని అధికార పార్టీ ముఖ్యనేతలు కొందరు అభిప్రాయపడుతున్నారు. ధర్మకర్తల ఎంపికకు సామాజిక సమీకరణ పాటించాల్సిన అవసరం ఉండటంతో స్థానిక ఎన్నికలకు ముందు కమిటీని వేసి కొత్త తలనొప్పి కోరి తెచ్చుకోకపోవచ్చంటున్నారు. మరికొందరు మాత్రం ఎమ్మెల్యే ఒక నిర్ణయం తీసుకుంటే వెనకడుగువేయరని, ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేస్తారనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

చైర్మన్ పదవి కోసం ప్రయత్నాల్లో ఆశావహులు

ట్రస్టు బోర్డు చైర్మన్ పదవి కోసం ఆశావహుల సంఖ్య కూడా ఎక్కువగానే వినిపిస్తోంది. ట్రస్టు బోర్డు ఏర్పాటవుతున్న నాటి నుంచి నేటి వరకు కూడా చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామాలకు చెందిన వ్యక్తులే చెర్వుగట్టు దేవస్థానానికి చైర్మన్లుగా పనిచేసిన చరిత్ర ఉంది. అయితే ఈ పర్యాయం చైర్మన్ పదవి విషయంలో ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తారా? లేక కొత్త సంప్రదాయానికి ఎమ్మెల్యే ఆసక్తి చూపుతారా? అనేది అందరిలోనూ మెదిలే ప్రశ్న. కాగా, దేవస్థానం చైర్మన్‌గా పదవిని ఆశిస్తున్న వారిలో చెర్వుగట్టు నుంచి పలువురి పేర్లు ప్రధానంగా ప్రచారంలో ఉన్నాయి. అయితే రాజకీయ సమీకరణలకు సంకల్పిస్తే మాత్రం కొత్త పేర్లు కూడా చోటు చేసుకునే అవకాశం లేకపోలేదంటూ తెలుస్తోంది.



ఆచి తూచి ఎంపిక

రూ.కోట్లలో ఆదాయం, లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే ప్రధాన క్షేత్రమైన చెర్వుగట్టుకు ధర్మకర్తల మండలి ఏర్పాటులో ఎమ్మెల్యే ఆచితూచి వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిది నార్కట్‌పల్లి సొంత మండలం కావడం, నామినేటెడ్ పదవుల పంపకంలో ఎమ్మెల్యే కొంత త్యాగానికి సిద్ధపడక తప్పదంటున్నారు. భువనగిరి ఎంపీ ఎన్నికల ప్రచారసభ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ కేడర్ గుర్తుచేస్తున్నారు. పదవుల విషయంలో పాత, కొత్తను కలుపుకుపోవాలని బహిరంగ సభలో రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యే వేముల వీరేశానికి పదేపదే సూచించిన తీరుతో మిత్రభేదానికి తావివ్వకపోవచ్చని భావిస్తున్నారు.

థర్మల్ ప్లాంట్‌లో భద్రతా చర్యలు చేపట్టాలి

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దామరచర్ల, సెప్టెంబరు 9: యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో భద్రతా చర్యలు పటిష్టం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో సోమవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలో చోరీ జరగడం ఇది రెండోసారి అని, భద్రత కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాధనాన్ని దోచుకోకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గత పాలనలో చోటుచేసుకున్న పొరపాట్లు జరగకుండా ప్రతీ ఒక్కరు బాధ్యతగా ఉండాలన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరిగితే తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, జెన్‌కో సీఈ సమ్మయ్య, సీఐ వీరబాబు, ఎస్ఐ ఇరుగు రవి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న పాపిరెడ్డి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 9: పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అలుగుపల్లి పాపిరెడ్డి డిమాండ్ చేశారు. టీపీయూఎస్ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ, మునుగోడు, గట్టుపల్ మండలాల్లో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం డీఏలను విడుదల చేయడంతోపాటు సమగ్రశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీపీయూఎస్ నిత్యం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో అదనపు ప్రధాన కార్యదర్శి పెంటయ్య, జిల్లా అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, రాష్ట్ర అడిట్ కమిటీ సభ్యుడు రవీందర్ రావు, కేశవ్, దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మురళి, విష్ణు, శ్రీనివాస్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి 'ప్రజావాణి' రేపటికి వాయిదా

నల్లగొండ, సెప్టెంబరు 9: హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించాల్సిన రాష్ట్రస్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని బుధవారానికి వాయిదా వేసినట్లు ప్రజావాణి నోడల్ అధికారి దివ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం సమావేశాలు నిర్వహిస్తున్నందున ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశామని, దీన్ని అర్జీదారులు గమనించాలన్నారు. బుధవారం జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ప్రమాదం అంచున సెల్ఫీలు

● సాగర్‌లో కూలిన వంతెనపై సెల్ఫీలు దిగుతున్న యువత



నాగార్జునసాగర్, సెప్టెంబరు 9 : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో పర్యాటకులు ప్రమాదం అంచున సెల్ఫీలు దిగుతున్నారు. సెల్ఫీలు దిగే క్రమంలో కాలు జారిపడితే ప్రాణనష్టం వాటిల్లే అవకాశం ఉంది. సాగర్ ప్రధాన డ్యాంనకు దిగువన కూలిపోయిన పాత వంతెనపైకి ఎవ్వరూ వెళ్లకుండా గోడ కట్టారు. అయినా పర్యాటకులు గోడ దూకి పాత వంతెనపైకి వెళ్లి సెల్ఫీలు దిగుతున్నారు. పాత వంతెనకు అసలే రెయిలింగ్ కూడా లేదు. ఈ వంతెన ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నిర్మిస్తుండగా, 1964లో వచ్చిన భారీ వరదలకు కూలింది. నాడు కూలీలు ఈ వరదలో కొట్టుకుపోయారు. వంతెన పాతది కావడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. అయినా పర్యాటకులు పాత వంతెనపై అటూ ఇటూ పరుగెత్తుతూ సెల్ఫీలు దిగుతున్నారు. అయినా సంబంధిత అధికారులు వారికి ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో జట్ల ఎంపికకు పోటీలు

దామరచర్ల, సెప్టెంబరు 9 : హైదరాబాద్‌లో ఈ నెల 13 నుంచి నిర్వహించే 34వ సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు బాల, బాలికల జట్టు ఎంపిక కోసం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలో గురుకుల బాలురపాఠశాలలో సోమవారం పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధప్రాంతాల నుంచి 200మంది బాలబాలికలు ఎంపికకు హాజరయ్యారు. వీరి నుంచి 15మంది బాలురు, 15మంది బాలికలను ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నూకల నాగేశ్వర్‌రావు, సోము సైదిరెడ్డి, బాల సత్యనారాయణ, అంజి, రమేష్‌రెడ్డి, విజయ్, మురళి, కోచ్ స్వాతి పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖో-ఖో జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. దామరచర్లలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా బాల, బాలికల జట్టు రాష్ట్ర సెక్రటరీ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రాష్ట్ర జట్లను ఎన్నుకున్నారని, అండర్-14లో బాలుర విభాగంలో సాగర్ బీసీ గురుకుల విద్యార్థులు ఆర్.నరేందర్, ఆర్.అరవింద్, ఎస్.కార్తీక్, కె.అజయ్ ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్స్‌పాల్ రాజశేఖర్, ఏటీపీ గాయత్రి, పడి విజయ్, అరుణ, పీఈటీ నర్సింహ అభినందించారు.

అండర్‌పాస్‌తో జీవనోపాధి ఎలా?

తిరుమలగిరి వ్యాపారుల అంతర్మథనం

తిరుమలగిరి, సెప్టెంబరు 9: హైదరాబాద్ ఔటర్‌రింగ్ రోడ్డు గౌరెల్లి నుంచి సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మీదుగా భద్రాద్రికొత్తగూడెం వరకు విస్తరించే జాతీయ రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని క్రాస్‌రోడ్డులో తొర్రూర్- వలిగొండ రోడ్డులో అండర్‌పాస్ నిర్మించనున్నట్లు జాతీయ రహదారి అధికారులు తెలిపారు. రహదారి విస్తరణ, అండర్‌పాస్ నిర్మాణంతో రహదారి వెంట ఉన్న ఇళ్లు, దుకాణాలు కొంత భాగం కోల్పోనున్నాయి. నష్టపోయిన వారికి ప్రభుత్వం పరిహారం అందించనుంది. తొర్రూర్- వలిగొండ మార్గంలో క్రాస్‌రోడ్డులో నిర్మించే అండర్‌పాస్‌ను ఇరువైపులా 400 మీటర్లతో నిర్మించనున్నారు. అండర్ పాస్ నిర్మాణంతో తొర్రూరు నుంచి వలిగొండకు వెళ్లే వాహనాలు పైనుంచి, జనగామ నుంచి సూర్యాపేటకు వెళ్లే వాహనాలు కింది నుంచి వెళ్లనున్నాయి.



తిరుమలగిరిలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

అండర్‌పాస్ వద్దంటున్న వ్యాపారులు

తిరుమలగిరిలో అండర్ పాస్ నిర్మిస్తే తమ జీవనోపాధి దెబ్బతింటుందని వ్యాపారులు చెబుతున్నారు. అండర్‌పాస్ కాకుండా రోడ్డును విస్తరించాలని ఎమ్మెల్యే సామేలుకు, జాతీయ రహదారి అధికారులకు స్థానిక వ్యాపారులు పలు మార్లు వినతిపత్రాలు అందజేశారు.



తిరుమలగిరిలో 15 కి.మీ మేర జాతీయరహదారి

తిరుమలగిరి మండలంలో ఈ రహదారి అనంతారం గ్రామం నుంచి మామిడాల వరకు 15 కిలోమీటర్ల మేర ఉంది. ఈ పరిధిలో రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీల నిర్మాణం దాదాపు పూర్తయింది. కొన్ని కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. గ్రామాల పరిధిలో సర్వీసు రోడ్డు నిర్మించారు. గతంలో ఏడు మీటర్లు ఉన్న రోడ్డును 10 మీటర్ల వరకు విస్తరించారు.



అండర్‌పాస్ నిర్మాణం

తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో అండర్ పాస్‌ను నిర్మిస్తాం. క్రాస్‌రోడ్డు సర్కిల్ నుంచి రెండు వైపులా 400 మీటర్ల పొడవుతో అండర్‌పాస్ ఉంటుంది. జాతీయ రహదారి నిబంధనల ప్రకారం అవసరమైన ప్రాంతాల్లో అండర్ పాస్‌లు, పట్టణ, మండల కేంద్రాల్లో రోడ్డును విస్తరిస్తున్నాం.

- బి.మోహన్, ఎస్ఈ, జాతీయ రహదారి

అండర్‌పాస్‌తో వ్యాపారాలు దెబ్బతింటాయ్


తిరుమలగిరిలో అండర్‌పాస్‌తో వ్యాపారాలు దెబ్బతింటాయి. కొన్నేళ్ల నుంచి వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. అండర్‌పాస్‌తో పట్టణంలో వాహనాలు ఆగవు. దీంతో వ్యాపారాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అందరి అభిప్రాయం మేరకు రోడ్డును విస్తరించాలి.

- తునికిపాటి రాంబాబు, వ్యాపారి, తిరుమలగిరి

రూ.60.50 లక్షలకు కొబ్బరికాయల విక్రయ హక్కులు

నార్కెట్‌పల్లి, సెప్టెంబరు 9: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో కొబ్బరికాయల విక్రయ హక్కును వేలంలో రెండో పాటదారుడైన కల్లూరి శ్రీనివాస్ పొందారు. ఏడాది కాలపరిమితి కింద కొబ్బరికాయలు విక్రయానికి ఈ నెల 5వ తేదీన బహిరంగ వేలం నిర్వహించారు. కాగా గ్రామానికి చెందిన చిక్కుళ్ల శ్రీనివాస్ రూ.60.60 లక్షలకు అత్యధికంగా పాటపాడి విక్రయ హక్కుకు అర్హతపొందాడు. కానీ వేలం నిబంధనల మేరకు 48 గంటల్లో 80శాతం వేలం డబ్బులు చెల్లించలేకపోవడంతో వేలం నిబంధనల మేరకు రూ.60.50 లక్షలు పాటపాడిన రెండో పాటదారుడు కల్లూరి శ్రీనివాస్‌కు వేలం హక్కును అధికారులు కల్పించారు. సోమవారం శ్రీనివాస్ వేలం డబ్బులను ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో సుధాకర్‌లకు అందజేశారు. కార్యక్రమంలో చెర్వుగట్టు దేవస్థాన మాజీ చైర్మన్ నల్ల వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిధుల స్వాహాపై సీఐడీ ఆరా



- అస్పత్రులు, గిరిజనతండాల్లో విచారణ
- అనుమానం ఉన్న సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలన

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 9: వైద్యం చేయకుండా ఆసుపత్రులు, చికిత్స చేయించుకోకుండానే కొంతమంది సీఎం సహాయనిధి సొమ్ము కాజేశారనే ఆరోపణలపై విచారించేందుకు సీఐడీ అధికారులు రంగంలోకి దిగారు. పలు ఆస్పత్రులపై కేసులు నమోదు చేసిన అధికారులు శనివారం మండలంలోని పలు తండాల్లో విచారణ చేపట్టారు. రాష్ట్రస్థాయిలో సంచలనంగా మారిన ఈ కేసుతో మండలానికి లింకు ఉందని తెలియడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన అమ్మ ఆసుపత్రి, నవీనా, మహేష్ ఆసుపత్రుల యాజమాన్యాలను నిందితులుగా పేర్కొంటూ రాష్ట్ర సీఐడీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ అనంతరం జైలుకు పంపారు. విచారణలో భాగంగా మిర్యాలగూడలోని సంబంధిత ఆసుపత్రుల నుంచి అవసరమైన డాక్యుమెంట్లను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకొని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలోనే అమ్మ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నట్లు ఎల్లాపురంతండా, తునికినూతల తండాలకు చెందిన అనుమానాస్పదంగా ఉన్న కొందరి సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను పరిశీలించారు. వారిని విచారించేందుకు ఇద్దరు సీఐలు, ఇతర పోలీసుల బృందం తండాలకు వచ్చింది. ఈ క్రమంలో ఎల్లాపురంతండాకు చెందిన ఓ మహిళ చికిత్స చేయించుకున్నట్లుగా మెడికల్ బిల్లులు ఉండగా, ఆమె నిజంగా శస్త్ర చికిత్స చేయించుకుందా లేదా అని అడిగినట్లు తెలిసింది. అదేవిధంగా ఆమె సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులో తండాకు చెందిన వేరే వ్యక్తి ఫోన్ నెంబర్ ఉండడంపై ఆరాతీశారు. అదేవిధంగా తునికి నూతలతండాలో ఓ వ్యక్తికి చికిత్సకోసం రూ.1.40లక్షలు ఖర్చు అయినట్లు సదరు ఆసుపత్రి నుంచి బిల్లులు తీసుకున్నట్లు ఉండగా సంబంధిత వ్యక్తిని అడగగా జ్వరం రావడంతో చికిత్స చేయించుకున్నట్లు చెప్పినట్లు తెలిసింది. చికిత్స ఖర్చులకు మించి మెడికల్ బిల్లులను ఆసుపత్రులు ఇవ్వడం, చికిత్స చేయించుకోనప్పటికీ కొందరి పేర్లపై బిల్లులను సృష్టించినట్లు అనుమానాలతోనే సీఐడీ అధికారులు ఈ విచారణ చేసినట్లు తెలుస్తోంది.

దళారులు, పైరవీకారులదే కీలకపాత్ర

ఈ వ్యవహారంలో దళారులు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. దళారులు ఒక్కో బిల్లుకు రూ.10వేల నుంచి రూ.20వేల చొప్పున లబ్ధిదారుల నుంచి దళారులు వసూలు చేసినట్లు వినికిడి. ఈ విధంగా అక్రమంగా పొందిన మెడికల్ బిల్లులను సదరు వ్యక్తులు స్థానికంగా పలుకుబడి ఉన్న నాయకులు పైరవీ కోసం ఇస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆ నాయకులు స్థానిక ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను ఈ మెడికల్ బిల్లులతో పాటు ఆధార్, రేషన్‌కార్డులను జతపరిచి హైద్రాబాద్‌లోని సీఎం రిలీఫ్ ఫండ్ ముఖ్య కార్యాలయంలో ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు పైరవీలు చేసే నాయకులు సీఎంఆర్ఎఫ్ కార్యాలయంలోని ముఖ్య అధికారులతో పైరవీలు చేసే నాయకులకు సన్నిహిత సంబంధాలు ఉండడంతో మంజూరు కావాల్సిన దానికంటే ఎక్కువ మొత్తంలో డబ్బులు వచ్చేలా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మిర్యాలగూడ నియోజకవర్గంతోపాటు మండలానికి సంబంధించి గతంలో మంజూరైన సీఎంఆర్ చెక్కుల జారీపై కూపీ లాగితే అక్రమార్కుల గుట్టు బయటపడే అవకాశం ఉందని మండలంలో చర్చ సాగుతోంది. నియోజకవర్గంలోని ఇతర మండలాల్లో కూడా సీఐడీ అధికారులు గోప్యంగా విచారణ చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం. గత ప్రభుత్వంలోనే సీఎంరిలీఫ్ ఫండ్ నిధులు దుర్వినియోగం అయినట్లు, ప్రస్తుత ప్రభుత్వం విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ క్రమంలో కొందరిని సోమవారం జిల్లాకేంద్రానికి విచారణ కోసం రావాలని చెప్పినట్లు సమాచారం.

హరిహరులకు విశేష పూజలు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 9: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్య క్షేత్రంలో హరిహరులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శివాలయంలోని పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి వారికి స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకస్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.13,85,278 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారిని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో లడ్డూ ప్రసాదం అందజేశారు.


శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ వాగు


జాజిరెడ్డిగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ వాగు

అర్వపల్లి, సెప్టెంబరు 9: హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు సోమవారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండల సరిహద్దులోని మూసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. హైదరాబాద్-వరంగల్ నుంచి వస్తున్న వరద పెరగడంతో జాజిరెడ్డిగూడెం-వంగమర్తి వద్ద మూసీ ప్రవాహం ఎక్కువగా ఉంది. ఈ ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మూసీ వాగులో బోర్లు వేసిన వారు రాత్రి వేళల్లో వెళ్లవద్దని సూచించారు.

గండ్ల చెరువుకు గండిపెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

మోతె: సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని విభాలపురం గ్రామ రెవిన్యూ పరిధిలో ఉన్న గండ్ల చెరువుకు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి గండి పెట్టారు. దీంతో చెరువులో నీరు వృథా వెళ్తోంది. విషయం తెలుసుకున్న ఐబీ డీఈ రమేష్ చెరువును పరిశీలించారు. చెరువులకు గండి పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెరువుకు గండి పెట్టిన వారిని గుర్తించి కేసు నమోదు చేస్తామని అన్నారు.


వృథాగా పోతున్న చెరువు నీరు

సూర్యాపేటలో రోజంతా ముసురు

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లాలో సోమవారం రోజంతా ముసురు కమ్మేసింది. అత్యధికంగా చివ్వెంలలో 10.3 మిల్లీమీటర్లు, అత్యల్పంగా తుంగతుర్తిలో 1.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో 6.1 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది.

బాధితులకు తక్షణమే సహకారాలు అందించాలి

కోదాడ టౌన్: వరద బాధితులకు తక్షణమే సహాయ, సహకారాలు అందించాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి వివిధ శాఖ అధికారులకు సూచించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, మునిసిపల్, పోలీస్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో వరదలతో జరిగిన పంట, ఆస్తి నష్టాలపై అధికారులతో చర్చించారు. నష్టం వివరాలను శాఖల అధికారులు సమన్వయం చేసుకొని వెంటనే ప్రభుత్వానికి అందించాలన్నారు. ప్రతీ అధికారి మానవతా దృక్పథంతో వరద బాధితులకు సహాయపడాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై, సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం తక్షణ సహాయంగా కొన్ని నిధులు విడుదల చేసిందన్నారు. నిధులు లబ్ధిదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

వరదనీటిలో తడిసిన రేషన్ బియ్యం

హుజూర్‌నగర్: పట్టణంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దద్దనాల చెరువు కాలనీలో 32వ రేషన్ దుకాణంలోని బియ్యం తడిసి ముద్దయింది. సుమారు 35క్వింటాళ్ల రేషన్ బియ్యం తడిసి పోవడంతో దద్దనాల చెరువు కాలనీ చుట్టూ వరదనీరు రావడంతో డీలర్ షాపులోకి నీళ్లు వచ్చాయి. డీలర్ సంధ్యారాణి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు విచారణ చేశారు. అనుకోకుండా భారీ వర్షాలు కురవడంతో రేషన్ బియ్యం పెద్ద మొత్తంలో తడిసిపోయాయని అధికారులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 9: అప్పుల బాధ తట్టుకోలేక ఆటోడ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన రాగుల నాగేష్(34) టాటా ఏసీ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆటో కొనుగోలుకు అప్పు చేశాడు. కుటుంబం గడవడానికి, ఆటోపై తెచ్చిన అప్పు తీర్చడానికి కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. సోమవారం ఆటోలో ఇంటి నుంచి బయలుదేరి మధ్యాహ్నం జలాల్‌పూర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో భార్య ధనలక్ష్మికి ఫోన్‌లో వీడియోకాల్ చేసి చనిపోతున్నానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. వెంటనే భార్య సమీప బంధువులకు ఫోన్‌చేసి తనకు భర్త ఫోన్ చేసిన విషయాన్ని చెప్పింది. బంధువులు, భార్య ఆటో నిలబెట్టిన సమీపంలోని అటవీ ప్రాంతంలో వెతకగా ఒక చెట్టుకు అప్పటికే ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. దగ్గరకు వెళ్లి చూడగా కొన ఊపిరితో ఉన్నాడని ఆస్పత్రికి తరలిద్దామని ప్రయత్నిస్తుండగా నాగేష్ మృతిచెందాడు. బంధువులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ భాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ధనలక్ష్మి, నాగేష్‌ది ప్రేమ వివాహం. నాగేష్ మృతదేహం వద్ద ధనలక్ష్మి విలపిస్తుండడం స్థానికులను కంట తడిపెట్టించింది.


నాగేష్ మృతదేహం

ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

దేవరకొండ, సెప్టెంబరు 9: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని గొట్టిముక్కల వాగు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. గొట్టిముక్కల, ముదిగొండ వాగుల నుంచి ఇసుక అక్రమంగా రవాణా అవుతున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేసి లారీలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా సీజ్ చేసినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి


బోల్తాపడిన వాహనం, ఆదిత్య, రిజ్వాన్ మృతదేహాలు

దామరచర్ల, సెప్టెంబరు 9: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో డీసీఎం ఢీకొని ఇద్దరు, కట్టంగూరు మండలంలో గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొని యువకుడు, యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలో రోడ్డు దాటుతుండగా వృద్ధురాలు మృతిచెందింది. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం గ్రామ శివారులో ఓ ప్రైవేట్ కేబుల్ నెట్‌వర్క్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఆ సంస్థలో పనిచేస్తున్న దేవరకొండ మండలం కొండభీమనపల్లికి చెందిన పంబాల ఆదిత్య(21), దేవరకొండకు చెందిన మహమ్మద్ రిజ్వాన్(36) మరో ఇద్దరితో కలిసి బొలెరో వాహనంలో సోమవారం తెల్లవారుజామున బొత్తలపాలెం వద్దకు చేరుకొని వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపి నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి పక్కన సమస్య తలెత్తిన కేబుల్‌కు మరమ్మతులు చేస్తున్నారు. ఈ క్రమంలో మిర్యాలగూడ నుంచి గుంటూరు వైపు మిర్చిలోడుతో వెళ్తున్న డీసీఎం వాహనం డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే పనిచేస్తున్న నలుగురిని ఢీకొట్టింది. దీంతో కేబుల్ వర్క్ చేస్తున్న ఆదిత్య, రిజ్వాన్ అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడిన జాషువా, కిరణ్‌కుమార్‌లను 108లో చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆదిత్య అవివాహితుడు. ఇటీవలే కేబుల్ సంస్థలో చేరాడు. రిజ్వాన్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇతను సంవత్సరంగా సంస్థలో పనిచేస్తున్నాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆదిత్య తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు. డీసీఎం వాహన డ్రైవర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

ఇంటి నుంచి బయలుదేరిన కొద్ది సేపటికే..


మధు మృతదేహం

కట్టంగూరు: నల్లగొండ జిల్లా కట్టంగూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్ వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ఎన్. శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన గందమల్ల మధు(25) ద్విచక్ర వాహనంపై అయిటిపాముల గ్రామం నుంచి తాను పనిచేస్తున్న చిట్యాలలోని ఓ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కార్యాలయానికి ఆదివారం రాత్రి 11.30గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయలు దేరాడు. ఎన్‌టీఆర్‌నగర్ వద్ద హైదరాబాద్ వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టాడు. దీంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మధు తండ్రి నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్తూ అనంతలోకాలకు

భువనగిరి రూరల్: బంధువు అంత్యక్రియలకు వెళ్తున్న మహిళ రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం మన్నెవారి పంపు గ్రామంలో జరిగింది. రూరల్ ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంగదేవి గోపమ్మ(62) జనగాం జిల్లా స్టేషన్‌ఘన్‌పురంలో సమీప బంధువు అంత్య క్రియలకు వెళ్లేందుకు సోమవారం ఇంటి నుంచి బయలు దేరింది. గ్రామం నుంచి కాలినడకన బస్టాప్ వరకు వచ్చి రోడ్డు దాటుతున్న క్రమంలో తుర్కపల్లి నుంచి భువనగిరి వైపునకు అతివేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం గోపమ్మను ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి క్షతగాత్రురాలిని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి గోపమ్మ మార్గమధ్యలోనే మృతి చెందిందని తెలిపారు. గోపమ్మ కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


గోపమ్మ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నిడమనూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిడమనూరు గ్రామానికి చెందిన దండగల భీమయ్య(55) సోమవారం మధ్యాహ్నం సమయంలో నిడమనూరులో రోడ్డు దాటుతుండగా మిర్యాలగూడ నుంచి హాలియా వైపు సిమెంటు లోడుతో వెళుతున్న డీసీఎం వాహనం ప్రమాదవశాత్తు ఢీకొనగా భీమయ్య తలకు గాయాలయ్యాయి. బాధితుడిని వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా భీమయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు దండగల సత్యమయ్య ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవరు అయిన పాలకీడు మండలం మహంకాళిగూడెం గ్రామానికి చెందిన నిందితుడు గంజి రాముపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ రమేష్ తెలిపారు.

వృద్ధుడి మృతదేహంతో ఇంటి ఎదుట ధర్నా

● తన ఇంటి వద్ద నుంచి తీసేయాలని ఆగ్రహం ● తమ ప్లాట్ ఆక్రమించున్నాడని వృద్ధుడి కుటుంబసభ్యుల ఆరోపణ

ఆత్మకూరు(ఎం) సెప్టెంబరు 9: అద్దె ఇంట్లో ఉంటున్న వృద్ధుడు మృతిచెందాడు. మృతదేహాన్ని ఇక్కడి నుంచి తీసుకెళ్లాలని ఇంటి యజమాని వృద్ధుడి కుటుంబసభ్యులకు చెప్పాడు. అదే ఊర్లో తమ ప్లాట్‌ను ఓ వ్యక్తి ఆక్రమించుకొని, ఇల్లు కట్టుకొని తమను అన్యాయం చేశాడని, ఆ వృద్ధుడి కుటుంబసభ్యులు ఆ ప్లాట్‌లో నిర్మించుకున్న ఇంటి వద్ద మృతదేహాన్ని ఉంచి ధర్నా చేశారు. తాను ప్లాట్ కొనుగోలు చేసి ఇల్లు కట్టుకున్నానని సదరు వ్యక్తి కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. సోమవారం సాయంత్రం యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన దుంప ఎల్లయ్య(85) అతని భార్య, మనువడితో కలిసి మండలకేంద్రంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. సోమవారం ఎల్లయ్య అనారోగ్యంతో మృతిచెందగా, శవాన్ని తీసుకెళ్లాలని ఇంటి యజమాని చెప్పాడు. అయితే మండల కేంద్రంలో రామ్‌నగర్‌కాలనీలోని 104నెంబర్ గల 200 గజాల ప్లాటు విషయంలో దుంప ఎల్లయ్యకు అదే గ్రామానికి చెందిన దుంప రమేష్ మధ్య పదేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. రమేష్ తమ ప్లాట్‌ను అన్యాయంగా ఆక్రమించాడని, ఎల్లయ్య కుటంబ సభ్యులు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్లాట్‌ను ఎల్లయ్య కుటుంబసభ్యులు తనకు విక్రయించారని రమేష్ వాదిస్తున్నాడు. ఈ పంచాయితీ కొనసాగుతుండగా సోమవారం ఎల్లయ్య మృతదేహానికి దహన సంస్కారాలు చేయడానికి కుటుంబ సభ్యులు బంధువులు కలిసి రమేష్ నిర్మించిన 104వ నెంబర్ ప్లాట్ ఎదుట ఎల్లయ్య మృతదేహాన్ని ఉంచారు. మృతదేహాన్ని ఇంటి ఎదుట నుంచి తీసేయాలని దుంప రమేష్ అతని సోదరులు చెప్పారు. 'ఈ ప్లాటు మాది.. కొన్నాము' అంటూ ఎల్లయ్య కుటుంబ సభ్యులతో వాదనకు దిగారు. 'ఈ ప్లాటు మాదే.. మీకు విక్రయించలేదు... మీరు ఆక్రమించుకున్నారు.. శవానికి కార్యక్రమాలు ఇక్కడే నిర్వహిస్తాం.. శవాన్ని ఇక్కడి నుంచి తీయం' అని ఎల్లయ్య కుటుంబసభ్యులు వాదించారు. దీంతో అక్కడ ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ గొడవ జరుగుతుండగానే రమేష్ ఇంట్లోకి వెళ్లి కిరోసిన్ తెచ్చుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో సోదరులు రమేష్‌ను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాల వాదనలు విన్నారు. 104 నెంబర్ గల ప్లాటు దుంప ఎల్లయ్యకు చెందినదని పదేళ్ల క్రితం అతని కుటుంబ సభ్యులు ఇక్కడే గుడిసె వేసుకుని నిర్మించుకొని జీవించారని, వాళ్ల కుమారుడు, కోడలు, చిన్న మనువడు కూడా ఇక్కడే చనిపోయారని కాలనీవాసులు పోలీసులకు వివరించారు. కానీ ప్లాట్‌కు సంబంధించిన ఆధారాలు ఏవీ ఎల్లయ్య కుటుంబ సభ్యుల వద్ద లేవని, మృతదేహాన్ని ఇక్కడి నుంచి తరలించాలని ఏఎస్ఐ సైదులు చెప్పడంతో మృతదేహాన్ని వైకుంఠధామానికి తీసుకెళ్లారు. కాగా, నిరుపేద కుటుంబానికి చెందిన ఎల్లయ్య అంతిమ సంస్కారాలకు మండలకేంద్రంలో దాతలు రూ.45వేల విరాళాలు పోగేసి ఎల్లయ్య కుటుంబసభ్యులకు అందజేశారు.


ఎల్లయ్య మృతదేహంతో ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న భార్య సత్తమ్మ


గల్లంతైన మృతదేహాలు వెలికితీత

సూర్యాపేట, సెప్టెంబరు 9: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎం) మండల పరిధిలోని బొప్పారం గ్రామ క్వారీలో గల్లంతైన హీరా(56) మృతదేహం సోమవారం లభ్యమైంది. క్వారీలో నీటిని వాడడానికి మోటారు బిగించగా ఇటీవల కురిసిన వర్షాలకు అధిక మొత్తంలో నీళ్లు రావడంతో మోటారు మునిగిపోయింది. కౌలు రైతు బిచ్యా మోటారు తీసేందుకు హీరాను కూలికి తీసుకువచ్చాడు. శనివారం మోటార్ బైటికి తీసేక్రమంలో హీరా నీటిలో మునిగి పోయి బయటికి రాలేదు. అదివారం రాత్రి వరకు పోలీసులు, స్థానికులు, గజ ఈతగాళ్లు సీసీకెమెరాలతో పాటు ఫైర్ సిబ్బంది వెతికినా, నీటిలో బ్లాసింగ్ చేపట్టిన ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం హీరా మృతదేహం నీటిపై తేలియాడగా స్థానికులు బయటకు తీసుకువచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. హీరా కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ. సైదులుగౌడ్ తెలిపారు.

స్నేహితుడితో కలిసి చేపల వేటకు వెళ్లి..

పెద్దఅడిశర్లపల్లి: నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అక్కంపల్లి రిజర్వాయర్ గేట్ల ముందు ప్రధానకాల్వలో గల్లంతైన వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణానికి చెందిన మహమ్మద్ జుబేర్(47) అవివాహితుడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. స్నేహితుడు ఆరీఫ్‌తో కలిసి ఆదివారం సాయంత్రం దేవరకొండ నుంచి చేపలు పట్టేందుకు అక్కంపల్లి రిజర్వాయర్ వద్దకు వచ్చారు. ప్రధాన గేట్ల వద్ద గల కాల్వ దిగువకు చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కాల్వలో పడి గల్లంతయ్యాడు. వెంటనే అతని స్నేహితుడు ఆరీఫ్ పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చాడు. అదివారం రాత్రివరకు సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా జుబేర్ ఆచూకీ లభించలేదు. సోమవారం తెల్లవారుజామున అక్కంపల్లి గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద నీటిని నిలిపివేయడంతో రిజ్వాన్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని కొండమల్లేపల్లి సీఐ ధనంజయ్‌గౌడ్ పరిశీలించారు.

12 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల


నాగార్జునసాగర్ ప్రాజెక్టు 12గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, శాలిగౌరారం, సెప్టెంబరు 9: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక స్వల్పంగా తగ్గింది. దీంతో ప్రాజెక్టు 12క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,41,221 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 885 అడుగులు(215.8070టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 883.30 అడుగులుగా (206.0996టీఎంసీలుగా) ఉంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు ఐదు క్రస్ట్ గేట్లను 10అడుగుల మేరకు ఎత్తి 1,36,705 క్యూసెక్కుల నీటిని, కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 31,094 క్యూసెక్కుల నీటిని, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 37,116 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు మొత్తం 2,04,915 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 588.30అడుగులు (306.9898టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8,529 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 2210 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28, 907 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని, మొత్తం 26క్రస్ట్ గేట్లల్లో 12క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేరకు, ఎత్తి 95,064 క్యూసెక్కుల నీటిని దిగువకు విడు దల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 1,37,110 నీరు విడుదలవు తుం డగా, ఎగువ నుంచి 2,04,915 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

నెమ్మదించిన మూసీ.. గరిష్ట నీటిమట్టం దిశగా రిజర్వాయర్

పది రోజులుగా వరద నీటితో పొంగిపొర్లిన మూసీ నది సోమవారం కొంత నెమ్మదించింది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురిసిన వర్షాలకు ఆలేరు, బిక్కేరులతో పాటు చిన్నాచితక వాగులు, వంకలు పొంగి పొర్లుతుండడంతో వరద నీరు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరు తోంది. ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టడం, ప్రాజెక్టు నీటిమట్టం 641అడుగులకు పడిపోవడంతో ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ప్రాజెక్టు నీటిమట్టాన్ని క్రమంగా 645అడుగుల గరిష్ట స్థాయికి చేర్చేయత్నాల్లో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రాజెక్టు 2, 7వ నెంబర్ క్రస్టుగేట్లను అడుగు మేర ఎత్తి ఎగువ నుంచి వస్తున్న 3,254క్యూసెక్కుల వరద నీటిలో 1,240క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ క్రమంలో 645అడుగుల గరిష్ట నీటిమట్టం కలిగిన మూసీ ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 642.15 అడుగులకు చేరింది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.73 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పులిచింతలకు స్వల్పంగా తగ్గిన వరద

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులో గల పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం స్వల్పంగా తగ్గింది. ఆదివారం సాయంత్రం 2,30,000 క్యూసెక్కులుగా నమోదైన వరద ప్రవాహం సోమవారం సాయంత్రానికి 1,10,854 క్యూసెక్కులుగా నమోదైంది. పూర్తిస్థాయి నీటిమట్టం 175అడుగులు. (45.77 టీఎంసీలు)కాగా, 172.24 అడుగులు.(41.59 టీఎంసీలుగా) నమోదు కాగా నాలుగు రేడియల్ క్రస్టుగేట్ల ద్వారా 94,854 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్‌కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 104మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 1,10,854 క్యూసెక్కులుగా నమోదైంది.

నిండిన శాలిగౌరారం ప్రాజెక్టు

నల్లగొండ జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టులో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నిండింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగుల వరకు చేరడంతో ప్రాజెక్టు అలుగు పోస్తోంది. ప్రస్తుతం రబీ సీజన్‌లో కుడి, ఎడమ కాల్వల ద్వారా వరి పంట సేద్యమవుతుంది. మండలంలోని అడ్లూర్, ఆకారం, కొత్తపెల్లి ఉప్పలంచ, రామానుజపురం గ్రామాల చెరువులు, కుంటలు నిండి అలుగుపోస్తున్నాయి.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 9: గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్ అండ్‌బీ, పంచాయతీ ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీర్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు లాభాపేక్షతో కాకుండా సేవా భావంతో పని చేయాలని ఆయన సూచించారు. మారుమూల గ్రామానికి సైతం మెరుగైన రోడ్ల సౌకర్యం కల్పించాలని సూచించారు. రానున్న రోజుల్లో దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. రద్దీగా ఉన్న సింగిల్ రోడ్లన్నీ డబుల్ రోడ్లుగా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఆయన ఆదేశించారు.

మహిళా ఇంజనీర్లకు అద్భుత అవకాశాలు : బీఎల్ఆర్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 9: మహిళా ఇంజనీర్లకు మల్టీ నేషనల్స్ కంపెనీలు అద్భుత అవకాశాలు కల్పిస్తున్నాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న కొత్త కోర్సులను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు సుమన్‌బొత్రే విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో కళాశాల చైర్మన్ మహిమూద్‌అలీ, డైరెక్టర్ షెహ్లాబతూల్, వైస్ ప్రిన్సిపాల్ వాణి, మగ్దూం, సుబ్బారాయుడు, ఎజాస్, చావూస్ పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలి

చిట్యాల, సెప్టెంబరు 9: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మునిసిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. చిట్యాల మునిసిపల్ కార్యాలయంలో సోమవారం చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికుల వేతనాల పెంపుపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. జీవో 60 ప్రకారం మునిసిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరారు. కొంతమందికి పెంచి మరికొంతమందికి పెంచకపోవడం అన్యాయమన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కమిషనర్ వీరేందర్ మాట్లాడుతూ మునిసిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి కార్మికుల వేతనాలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు తుమ్మల వీరారెడ్డి, నూనె వెంకటస్వామి, జిట్ట నగేష్, పోకల దేవదాస్, అవిశెట్టి శంకరయ్య, పొన్నం లక్ష్మయ్య, చికిలంమెట్ల అశోక్, మారగోని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘం నాయకులు

నల్లగొండ, సెప్టెంబరు 9: జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి కోరారు. టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వ విధివిధానాలు రాగానే ఇళ్ల స్థలాలు ఇస్తామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు దోసపాటి సత్యనారాయణ, కిరణ్ రెడ్డి, అశోక్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాము, మధు, యాదగిరి, పంచలింగం, విజయ్‌కుమార్, మల్లేష్, జుబేర్ అహ్మద్, శ్రీను, రామకృష్ణ, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని మాడ్గులపల్లికి చెందిన జర్నలిస్టులు మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులుతో కలిసి సోమవారం జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ పాశం రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు చిట్యాల సైదులు, పొదిల నాగరాజు, రాంబాబు, సైదులు, సురేందర్, చక్రపాణి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లను పర్మినెంట్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 9: ప్రభుత్వం ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలని, రూ. 26వేల కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనా రాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్, డీఎంహెచ్‌వోకి వినతిప త్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం పథకం లో దేశవ్యాప్తంగా 10లక్షల మంది ఆశా వర్కర్లు వైద్య, ఆరోగ్య శాఖలో ప్రజలకు అనేక రకాల సేవలను అందిస్తున్నారని తెలిపారు. వారికి గౌరవ వేతనం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, నాయకులు తవిటి వెంకటమ్మ, పార్వతమ్మ, పూలమ్మ, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ జీవితం నేటి తరాలకు ఆదర్శం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ప్రజాకవి కాళోజీ జీవితం నేటి తరాలకు ఆదర్శమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం జిల్లాలో మహాకవి కాళోజీ జయంతి తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ పార్టీలు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆయన జయంతిని నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాళోజీ ఆశయసాధనకు కృషి చేయాలని, ఆయన రచనలను, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రజాకవిగా, తెలంగాణ వైతాళికుడిగా రచయితగా జీవితమే ఉద్యమంగా, ఉద్యమమే ఊపిరిగా జీవించిన మహోన్నతుడు కాళోజీ నారాయణరావు అని కొనియాడారు. ఆయన రచనలు సామాజిక చైతన్యానికి స్ఫూర్తిదాయకంగా, యువతకు ఆదర్శంగా ఉన్నాయన్నారు. పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిదేనని సగర్వంగా చాటి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ అని అన్నారు. తెలంగాణ ప్రజల గోసను తన అక్షరమాలతో లోకానికి చాటి చెప్పారని అన్నారు. ప్రజాకవిగా కాళోజీ పేరు, ప్రఖ్యాతలు పొందాడని గుర్తు చేశారు.

● దేవరకొండలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, ఆలంపల్లి నర్సింహ, రాంసింగ్ పాల్గొన్నారు.

● దేవరకొండలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాళోజీ జీవితం దేశానికే ఆదర్శమని అన్నారు. కాళోజీ కళాక్షేత్రం కోసం మాజీ ఎంసీ కేసీఆర్ మూడు ఎకరాల స్థలంతో పాటు రూ.12 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మునిసిపాలిటీలో మునిసిపల్ చైర్మన్ నర్సింహ నివాళులర్పించారు.

● డిండి ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో జయంతిని నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో డానియెల్, తహసీల్దార్ ఆంజనేయులు, మాజీ ఎంపీపీ వెంకటరమణ, కాశయ్య, అధికారులు పాల్గొన్నారు.



నల్లగొండలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జగదీ‌ష్‌రెడ్డి, నాయకులు

● చండూరు మండలంలో కాళోజీ జయంతిని నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మాధవరెడ్డి, సూపరింటెండెంట్ సూపరిండెంట్ నర్సింహ, ఏపీవో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● కేతేపల్లి మండలంలోని భీమారం జడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం లింగయ్య, టీచర్లు రాపోలు పరమేష్, జి.రమేష్, ఎల్.శ్రీధర్, శ్రీనివాస్, ఎం.శేఖర్, డి.నాగయ్య పాల్గొన్నారు.

● కట్టంగూరు నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, సూపరింటెండెంట్ చలపతి, ఏపీవో రాంమోహన్, ఏపీఎం సైదులు, ఉపాధ్యాయులు అంబటి అంజయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని విజేత డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ్, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎండీ.షోయబ్, విజేత బకాల్‌వాడీ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో బాలకృష్ణ తదితరులు కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

● చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరి భవాని. నాయకులు అంగిరేకుల గోవర్ధన్, కొండూరి పవన్‌కుమార్, మాస భాస్కర్, ఖలీల్‌బేగ్ పాల్గొన్నారు.

● హాలియాలో మునిసిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి, మునిసిపల్ మేనేజర్ అబ్దుల్ రషీద్, కౌన్సిలర్ దేపావత్ ప్రసాద్‌నాయక్, తక్కెళ్లపల్లి సైదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్)లోని జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, టీచర్లు భాస్కర్‌రెడ్డి, జార్జి పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, నందికొండ మునిసిపల్ కార్యాలయం, బీసీ గురుకుల పాఠశాలల్లో కాళోజీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ రాజశేఖర్, కమిషనర్ శ్రీను, వైస్ చైర్‌పర్సన్ నాగరాణి, కౌన్సిలర్లు రమేష్‌జీ, వెంకటయ్య పాల్గొన్నారు.

● కనగల్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ సునీత, ఏఆర్ఐ యాదగిరి, విఘ్నేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని వనిపాకల జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం బాణాల శ్రీనయ్యచారి, దంతూరి సైదులు, గంపల రవీందర్‌రెడ్డి, చొల్లేటి నర్సింహాచారి, కవిత తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి ఎంపీడీవో, జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీడీవో రాంరెడ్డి, హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు, టీచర్లు పాల్గొన్నారు.

● నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కవి మునాస్ వెంకట్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యాదయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

బతుకమ్మ కుంటలో పూజలు

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 9: నల్లగొండ నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆర్జాలబావి సమీపంలోని బతుకమ్మ చెరువు వద్ద జలపూజను నిర్వహించారు. అర్చక స్వాములు మంత్రోచ్ఛారణలతో జలానికి హారతి పట్టి లాంఛనంగా పూజలు చేపట్టారు. వినాయక నిమజ్జనం కార్యక్రమం ప్రశాంతం గా జరిగే విధంగా ఆశీర్వదించాలని పూజించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కట్ట సంపత్, గార్లపాటి వెంకటయ్య, ఓరుగంటి శ్రీనివాస్, జ్యోతి, కాశమ్మ, శ్రవణ్‌కుమార్, అమర్, నర్సింహ పాల్గొన్నారు.



హారతి పూజలు చేస్తున్న గణేష్ ఉత్సవ సమితి నాయకులు, అధికారులు



కొత్త వంతెన వద్ద నిమజ్జనాలు చేయరాదని ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ సంపత్

సాగర్ కొత్త వంతెన వద్ద నిమజ్జనం నిషేధం

నాగార్జునసాగర్: భద్రత కారణాల దృష్ట్యా గణేష్ విగ్రహాల నిమజ్జనం సాగర్ పైలాన్ కాలనీలోని కొత్త వంతెన వద్ద నిషేధించినట్లు సాగర్ ఎస్ఐ సంపత్ తెలిపారు. నిమజ్జనాలు హిల్‌కాలనీ సమీపంలో దయ్యాలగండి వద్ద సమ్మక్క-సారక్క పుష్కర ఘాట్ వద్ద మాత్రమే చేయాలని ఆయన తెలిపారు. ఈ మేరకు సాగర్ కొత్త వంతెన వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. భక్తులు, ప్రజలు నిమజ్జనాల కోసం సాగర్‌కు వచ్చేటప్పుడు పోలీసుల సూచనలు పాటించాలని ఆయన కోరారు. పోలీసులకు సహకరించాలని అన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మర్రిగూడెంలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న వ్యాపారవేత్త నళిని

తిప్పర్తి, సెప్టెంబరు 9: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ వ్యాపారవేత్త వీరవెల్లి నళిని అన్నారు. తిప్పర్తి మండలంలోని మర్రిగూడెం గ్రామంలో సోమవారం మాతృ మహిళా మండలి ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డితో కలిసి 20 కుట్టు మిషన్లను మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా రాణించినప్పుడే కుటుంబం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రతి మహిళ స్వయం శక్తితో ఎదగాలని సూచించారు. అనంతరం వీరవెల్లి నళిని తిప్పర్తి రామాలయ అభివృద్ధికి ఒక లక్ష రూపాయల చెక్కును ఆలయ కమిటీ సభ్యుడు గుండా సత్యనారాయణకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో మాతృ మహిళా మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి, ట్రైనర్ సంతోషి, పాశం శ్వేత, నాయకులు రొట్టెల రమేష్, జాకటి మోషె, నలపరాజు శ్రీనివాస్, ఉయ్యాల నాగరాజు, అంజి, సతీష్, బాబర్, సోమరాజు, గిరి, భాస్కర్ పాల్గొన్నారు.

బీసీ కులగణన వెంటనే చేపట్టాలి



నల్లగొండలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ, సెప్టెంబరు 9: బీసీ కులగణన వెంటనే చేపట్టాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని గణనాథుడికి పూజలు చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలిజాల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు విశ్వనాధుల శివకుమార్, నాయకులు వనం వెంకటేశ్వర్లు, కోట రమణ, వీరమల్ల ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా 19వ వార్డు సంజీవయ్య నగర్‌లోని మండపంలో జరిగిన పూజలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, కౌన్సిలర్ గణేష్, ఏచూరి భాస్కర్, జర్నలిస్టులు మహేందర్‌రెడ్డి, జయశంకర్, రమేష్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

● *ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్*

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 9: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావిధానాలు మార్చాలని, విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మధుసూదన్ అన్నారు. పట్టణంలోని ఆదిత్య ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విస్తరిస్తున్న ఇంటర్నెట్ విప్లవంతో ప్రపంచవ్యాప్తంగా మానవ రహిత సేవలు అందుబాటులోకి వస్తున్నాయని, మర మనుషుల వినియోగం అంతకంతకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ తరుణంలో ప్రైవేట్ పాఠశాలలు మరింత కష్టపడాల్సి ఉందని, మానవ వనరుల సంపద తయారు చేయడంలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఏఐ, చాట్ జీపీటీల సేవలు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ నేటి విద్యార్థులను రేపటి పవర్‌ఫుల్ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఇక సమస్యల పరిష్కారానికి ఐక్యత అవసరమని, సభ్యులందరూ ఏకమవ్వాలని ఆయన సూచించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌రావు, కోశాధికారి రాఘవేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. రామ్మోహన్, గాదె రవీందర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి రాములు, మారుతి అమరేందర్‌రెడ్డి, శ్రీరామకవచం నాగరాజు, కుందూరు శ్యాంసుందర్‌రెడ్డి, వంగాల నిరంజన్‌రెడ్డి, కేకే. జయరాజన్, రాధాకృష్ణ, శ్రీనివాస్, రవికుమార్, శ్యాం, అహ్మద్, వినయ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, సాయిశ్రీను తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ట్రస్మా రాష్ట్ర కమిటీ సభ్యులు

వచ్చే ఏడాది దసరాలోపు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

● *కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి*



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ, సెప్టెంబరు 9: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కృషి, సహకారంతో వచ్చే సంవత్సరం దసరాలోపు జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు కానున్నాయని మాజీ జడ్పీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో నల్లగొండ ప్రెస్‌క్లబ్ కార్యాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం నుంచి జర్నలిస్టులకు పూర్తి సహాయ, సహకారాలు అందించేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు చేస్తుందని అన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. తెలంగాణ సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని అన్నారు. గత ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని, హెల్త్‌కార్డులు సైతం ఉపయోగపడ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు మంచి రోజులు రానున్నాయని అన్నారు. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం జాబితాను సిద్ధం చేయాలని, ఆ జాబితా పారదర్శకంగా రూపొందించి అందించాలని సూచించారు. కార్యక్రంలో మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఐబీసీ ఎండీ ఏచూరి భాస్కర్, సీనియర్ జర్నలిస్టు గుండగోని జయశంకర్‌గౌడ్, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి చల్లా సాంబశివారెడ్డి, నల్లగొండ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పులిమామిడి మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాదె రమేష్, జర్నలిస్టు నాయకులు, జర్నలిస్టులు రవిశంకర్, వెంకట్‌రెడ్డి, సల్వాది జానయ్య, వెంకట్‌రెడ్డి, వీరస్వామి, వరుణమ్మ, రవికుమార్, మధు, కంది భజరంగ్ ప్రసాద్, శోభన్‌బాబు, నరేందర్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట ధర్నా

నల్లగొండ, సెప్టెంబరు 9: పాప మృతికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట సోమవారం కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ జిల్లా కోకన్వీనర్ జగన్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన కృపారాణి ఈ నెల 4వ తేదీన జిల్లా కేంద్రాస్పత్రిలో డెలివరీ కోసం జాయిన్ అయిందని అన్నారు. డాక్టర్లు 8వ తేదీన కృపారాణికి ఆపరేషన్ చేశారు. ఆలస్యంగా ఆపరేషన్ చేయడం వల్ల పాప కడుపులోనే మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన కార్యక్రమంలో శంకర్, సైదులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కమిటీ



రాకేష్‌కుమార్

శాలిగౌరారం, సెప్టెంబరు 9: టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రాగి రాకేష్‌కుమార్ ఎన్నికయ్యారు. సోమవారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, యాట మధుసూదన్‌రెడ్డి సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాగి రాకేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కడేరు రవికుమార్, ఉపాధ్యక్షులు చింతిరాల పురుషోత్తం, మన్నె దేవయాని, చినేని కిషోర్, కార్యదర్శులు పి.మల్లేష్, నోముల భగత్, కె.లింగయ్య, టి.వనజాత, ఎండీ ముజీబ్‌ఖాన్, ఎం.పద్మలత, మహిళా కన్వీనర్ వై.మానస, సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎ.చంద్రశేఖర్, క్రీడా కన్వీనర్ చివుట జ్యోతి, ప్రతిక కన్వీనర్‌గా ఎస్‌కె.అల్లావుద్దీన్ ఎన్నికయ్యారు.

విద్యుదాఘాతంతో మృతి చెందడం బాధాకరం : ఎమ్మెల్సీ

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 9: విద్యుదాఘాతంతో వివాహిత బనావత్ సరిత మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని గర్కనట్ తండాకు చెందిన బనావత్ సరిత ఆదివారం మృతి చెందడంతో పోస్టుమార్టం నిమిత్తం సాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆసుపత్రికి వెళ్లి వారి కుటుంబీకులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు అల్లి పెద్దిరాజు, దేశ బాలు, మాజీ సర్పంచులు బిచ్చానాయక్, రంగసాయినాయక్, స్వామినాయక్, మాజీ ఉపసర్పంచ్ కిశోర్‌నాయక్, రవీంద్రచారి, కాట్నం సతీష్‌గౌడ్, లాలునాయక్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం...

గట్టుప్పల్: మండలంలోని తేరట్‌పల్లి గ్రామానికి చెందిన గొరిగె మల్లయ్య కుమార్తె అనూష అనారోగ్యంతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్‌లో భాగంగా ముందస్తు చికిత్స కోసం రూ.2లక్షల ఎల్‌ఓసీ లెటర్‌ను పంపించారు. దీంతో తేరట్‌పల్లి కాంగ్రెస్ కార్యకర్తలు ఆ లెటర్‌ను అనూష తండ్రి మల్లయ్యకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పగిల్ల వీరయ్య, గిరి సత్తయ్య, వీరమల్ల శ్రీశైలం, గిరి శంకర్, ఆంజనేయులు, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

దేవరకొండ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఇరగదిండ్ల కృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన బీసీ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు చొల్లేటి భాస్కరచారి తదితరులు పాల్గొన్నారు.

డిండి: మండలకేంద్రంలోని డీఎస్‌టీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని వినతిపత్రంలో కోరారు.

డిండి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని తహసీల్దార్ అంబటి ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో చదువుతున్న పేద విద్యార్థులకు యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డానియెల్, ఎస్ఐ రాజు, ఏటి కృష్ణ, రాధిక, శ్రీశైలం, ఆంజనేయులు, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

డిండి: మండల కేంద్రానికి చెందిన ఆరేకంటి నర్సింహ అనారోగ్యంతో మృతి చెందారు. డిండి యువత చేయూత అనే నినాదంతో డిండి గ్రామానికి చెందిన 21 మంది యువకులు మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్నారు. ఇందులో భాగంగా నర్సింహ కుటుంబ సభ్యులకు రూ.10వేల నగదు మృతుని కుమారుడు జెస్సికి అందజేశారు. కార్యక్రమంలో బాదమోని శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, కృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

హాలియా: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఫొటోగ్రాఫర్ వెంగన్నగూడెం రవికి అనుముల మండల ఫొటోగ్రాఫర్లు ఆర్థికసహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఫొటో గ్రాఫర్లందరూ కలిసి సేకరించిన రూ.20,800లను నల్లగొండ జిల్లా గౌరవ సలహాదారుడు చవ్వా వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పసుపులేటి కృష్ణ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా రవికి డబ్బులను పంపించారు. ఈ సందర్భంగా సహాయం అందజేసిన ప్రతి ఒక్క ఫొటోగ్రాఫర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల కోశాధికారి లింగాల సైదులు, జానయ్య, శంకర్ పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని ముత్యాలమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్ పూజ కార్యక్రమంలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ముత్యాలమ్మ దేవాలయ అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ నిర్వాహకులు నేతాళ్ల వెంకటేష్ యాదవ్, వడ్త్య చైతన్యనాయక్, యాదవసంఘం నాయకులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్: ప్రభుత్వ నిబంధనలు పాటించని సంగం డెయిరీ సంస్థపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండలంలోని తుంగపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన సంగం డెయిరీ సంస్థ నిబంధనలు పాటించకపోవడం వల్ల కాలుష్యానికి కారణమవుతుందని ఆరోపించారు. డెయిరీ తన తయారీ సామర్థ్యాన్ని నాలుగు రెట్లు పెంచుతుందని అన్నారు. దీని వల్ల కాలుష్యం మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు స్పందించి వెంటనే డెయిరీ సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చిట్యాలరూరల్: మండలంలోని చిన్నకాపర్తికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు వడ్డెపల్లి సైదులు మృతి చెందాడు. అతని దశదినకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీరేశం పాల్గొని సైదులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పిల్లల విద్యాభ్యాసానికి తాను అండగా ఉంటానని అన్నారు.

నల్లగొండ కల్చరల్: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆకునూరు సత్యనారాయణ, ఎల్లెందుల సైదులుయాదవ్, లక్ష్మీనారాయణ, వంశీ, లక్ష్మణ్, సుశీల, శివ పాల్గొన్నారు.

కనగల్: అనారోగ్య కారణాలతో మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను పార్టీ తరపున మంత్రి వెంకట్‌రెడ్డి అన్ని విధాలుగా ఆదుకుంటారని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి అన్నారు. మండలంలోని పొనుగోడులో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మొండికత్తి ప్రదీప్‌కుమార్ కుటుంబానికి మంత్రి పంపిన రూ.50వేల ఆర్థికసాయాన్ని వారు అందజేశారు.

మునుగోడు: బెల్ట్‌షాపుల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పిలుపు మేరకు పోలీస్‌శాఖ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బెల్ట్‌షాపులు నిర్వహించవద్దని అవగాహన ర్యాలీ నిర్వహించారు. బెల్ట్ షాపులు ఉంటే ప్రతి ఒక్కరూ మద్యానికి బానిసలై బాధిత కుటుంబాలు వీధిన ప డే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ అంజయ్యప్రజాపతి, మాజీ ఎంపీపీలు పోలగోని సత్యం, కర్నాటి స్వామి, యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సైదులు, నాయకులు చెన్నారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహ, భాస్కర్, యాదగిరి, అన్వర్, సైదులు పాల్గొన్నారు.

మునుగోడు: కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయకుడిని ఏర్పాటు చేయటం అభినందనీయమని తహసీల్దార్ నరేందర్ అన్నారు. పట్టణంలోని కుమ్మరివాడలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడిని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ నరేష్, సర్వేయర్ బొడ్డుపల్లి అశోక్, శ్రీను, దినేష్, వంశీకృష్ణ, రవి, గణేష్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు: బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యుడు రాపోలు జయప్రకాష్‌ను నిడమనూరుకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో మాజీ ఎంపీపీ అంకతి వెంకటరమణ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ సైదయ్యనాయుడు ఉన్నారు.